

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ శనివారం 15-08-2026 సంపుటి: 02 సంచిక : 43 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Saturday, 15-08-2026 Volume :02 Issue: 43 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani







## ఎర్రకోట ముస్తాబు

- వందేమాతరంతో కొత్త శకం
- పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం
- ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు
- బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు
- ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్

02

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సర్వం సిద్ధమైంది. ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. 150 ఏళ్ల 'వందేమాతరం'కు ప్రత్యేక గౌరవం, యువశక్తికి పెద్దపీట, మారుమూల గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాక ఆవిష్కరణ వంటి విశేషాలతో ఈసారి వేడుకలు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి.



### అసెంబ్లీకి రా...
## నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

- నీలా మేం దూషించం... అవమానించం
- ఒకరోజు కాకపోతే రెండ్రోజులైనా చర్చకు మేం రెడీ
- కళ్లున్న కబోదిలా .. ప్రెస్ మీట్లలో మాట్లాడడం కాదు పులివెందుల ఎమ్మెల్యేగా సభకు రా... జగన్‌కు మంత్రి సవిత సవాల్
- గ్రూప్ 1 అక్రమాలు బయటకు రావడంతోనే గొడ్డలి పార్టీ డ్రామాలు
- మెగా డీఎస్సీపై డైవర్షన్ రాజకీయాలు
- విద్యార్థులతో ధర్నాలు సిగ్గు చేటు
- అర్హులందరికీ 'నేతన్నల సేవలో' అందిస్తాం
- పథకాలను లబ్ధిదారులకు అందజేయాల్సిన బాధ్యత అధికారులదే
- ఆర్ అండ్ బి రహదారులు, బీసీ సంక్షేమంపై సమీక్షలో మంత్రులు సవిత, జనార్ధన్ రెడ్డి

**అమరావతి :**
కళ్లున్న కబోదిలా మాట్లాడడం కాదు... ప్రెస్ మీట్లు పెట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా... రాయలసీమ, పులివెందుల అభివృద్ధి, మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల్లో అక్రమాలు... మీకు నచ్చిన ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం. గతంలో టీడీపీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను మీరు దూషించినట్లు మీ కుటుంబ సభ్యులను మేం దూషించం... గౌరవంగా సభను నిర్వహిస్తున్నాం... ఒకరోజు కాకుంటే రెండ్రోజులు చర్చిద్దాం... సభకు రా..!' అని జగన్ కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలు మాత్రమే, తాము కాదని అన్నారు. -మిగతా 2 లో

## నీటిని ఆపితే యుద్ధమే

- భారత్‌కు పాక్ ప్రధాని హెచ్చరిక
- ప్రతి బొట్టూ భారత్‌కు రెడ్ లైన్
- సింధూ జలాలపై పాక్ ప్రధాని ప్రగల్భాలు
- మా రక్షణకు ముప్పు వాటిల్లితే ఊరుకోం
- షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు


02

### యుద్ధప్రాతిపదికన
# పోలవరం పనులు

పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- 89.9 శాతం మేర పోలవరం సివిల్ పనులు పూర్తయినట్టు వెల్లడి
- ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్ణయం
- గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ పనులు చేపట్టాలని ప్రత్యేక సూచన
- రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలపైనా సమావేశంలో చర్చ
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యత
- వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ
- నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్యతా ప్రాజెక్టులు పూర్తి
- డేటా సెంటర్లకు నీటి సరఫరాపై దుష్ప్రచారం
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**ఏపీ స్టేట్ బ్యూరో,**
ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను జలవనరుల శాఖ అధికారులు ఆయనకు నివేదించారు. పోలవరం ప్రాజెక్టులో నిల్వటి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని, టీఆర్ఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులను శరవేగంగా చేపట్టినట్లు తెలిపారు.

-మిగతా 2 లో





## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు


- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ భద్రతా వ్యవస్థ అప్రమత్తం
- ఆగస్టు 15న పేలుళ్లకు పాల్పడతామంటూ ఈమెయిల్‌లో హెచ్చరికలు
- ఖలిస్తాన్ పేరుతో బెదిరింపులు.. హైకోర్టును టార్గెట్ చేసినట్లు ప్రకటన
- కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు, ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలపై నిఘా
- ఎయిర్‌పోర్టులు, కోర్టులు, ప్రజా ప్రదేశాల్లో భద్రత మరింత కట్టుదిట్టం

**న్యూఢిల్లీ**
దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగష్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని

-మిగతా 2 లో

### ఆగష్టు చివరి వరకు విస్తారంగా
## వర్షాలు కురిసే అవకాశం

02



- బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల ప్రభావం
- దేశ తూర్పు, పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో వానల జోరు
- వచ్చే 15 రోజుల్లో గణనీయమైన వర్షపాతంపై అంచనాలు
- ఎల్‌నినో ప్రభావంతో కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు
- వర్షపు లోటు తగ్గించే దిశగా అనుకూల వాతావరణం

### వికసిత్ భారత్ కోసం
## అందరూ పనిచేయాలి



- జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము

02



### ప్రతి ఎకరాకు
## నీరందిస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- కళింగపట్నం ఎత్తిపోతల పథకం ప్రారంభం
- గార నుంచి వమరవెల్లి వరకూ తిరంగా ర్యాలీ

**గార,**
శివారు భూములకు సైతం ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శుక్రవారం గారలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని గార నుంచి వమరవెల్లి వరకూ జాతీయ జెండాలు పట్టుకుని బైక్‌లతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వమరవెల్లిలో నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'ఎత్తిపోతల పథకం ద్వారా

-మిగతా 2 లో



## వీ లవ్ ఇండియా

- శ్రీలంక నుంచి జపాన్ వరకు..
- 36 దేశాల్లో 45 శాతం సానుకూలత
- సర్వేలో 79 శాతంతో టాప్‌లో శ్రీలంక
- 7 శాతంతో చివరిస్థానంలో పాకిస్థాన్
- ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ:**
శ్రీలంక నుంచి జపాన్ వరకు ఏ దేశాలు భారత్ ను ఎక్కువగా ప్రేమిస్తున్నాయి? అనే శీర్షికతో ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన వసంతకాలం 2026 గ్లోబల్ యాటిట్యూడ్స్ సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా భారత్ పట్ల అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. 36 దేశాల్లో సర్వే నిర్వహించగా సగటున 45 శాతం మంది అనుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు. శ్రీలంకలో అత్యధిక అనుకూలత నమోదైంది. అక్కడ 79 శాతం మంది భారత్ పట్ల సానుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. ఇది సర్వేలో అత్యున్నత స్థానం. యునైటెడ్ కింగ్ డమ్, కెన్యాలో 71 శాతం మంది అనుకూలంగా చూస్తున్నారు. జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్ లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్, జపాన్, థాయ్ లాండ్ లో 55 శాతం అనుకూల అభిప్రాయం వ్యక్తమైంది. కెనడా, సింగపూర్ లలో 51 శాతం, ఫ్రాన్స్, ఇండోనేషియాలో 50 శాతం అనుకూలంగా ఉన్నారు. అమెరికాలో 45 శాతం అనుకూలంగా చూస్తున్నారు. బంగ్లాదేశ్ లో 42 శాతం మాత్రమే అనుకూలం. పాకిస్థాన్ లో అత్యల్పం నమోదైంది. అక్కడ కేవలం 7 శాతం మంది మాత్రమే అనుకూల అభిప్రాయం కలిగి ఉన్నారు. 91 శాతం మంది ప్రతికూలంగా చూస్తున్నారు.

### వ్యక్తిగత అంశాలు,
# దూషణలు వద్దు

బీసీ జనగణన చేయడానికి దేశంలో ఎవరూ ధైర్యం చేయలేదు



- సోషల్ మీడియాలో సంయమనంతో వ్యవహరించాలి
- మహిళలను గౌరవించేలా భాష, భావ వ్యక్తీకరణ ఉండాలి
- రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి ప్రభావానికి లోనుకావద్దు
- జనసేన శ్రేణులకు అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం

**అమరావతి :**
జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో మాట్లాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత అంశాలు, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ పార్టీ సిద్ధాంతాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా స్పందించాలని ట్విట్టర్ వేదికగా సూచించారు. ఏదైనా అంశంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు లోనుకాకుండా సంయమనంతో వ్యవహరించాలని, అసభ్య పదజాలాన్ని ఉపయోగించరాదని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించేలా భాష, భావ వ్యక్తీకరణ ఉండాలని పేర్కొన్నారు.

-మిగతా 2 లో

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోటకు బాంబు బెదిరింపు

మొదటి తరువాయి

మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగస్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు. ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు. సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు. జామ్‌నగర్ హౌజ్, ఝుండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింతకట్టుదిట్టం చేశారు. శనివారం, ఆగస్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకల కోసం ఢిల్లీ నగరంలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వేడుకల కోసం మండి హౌజ్ మెట్రో స్టేషన్, ఐటీవో బిల్డింగులను అందంగా అలంకరించారు.

## నీటిని ఆపితే యుద్ధమే

ఇస్లామాబాద్:



నీరు మా రెడ్ లైన్ అని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారతదేశాన్ని మరోసారి హెచ్చరించారు. ఇస్లామాబాద్ లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాకిస్తాన్ నీటి ప్రతి చుక్కా మా రెడ్ లైన్ అని ప్రకటించారు. నీటిని ఆపితే యుద్ధమే అని అన్నారు. భారత్ సరైన మార్గానికి రాకపోతే నేరుగా ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసినందుకు ఆయన విమర్శించారు. గత సంవత్సరం యుద్ధంలో ఓటమి తర్వాత భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఈ ఒప్పందాన్ని నిలిపివేసి శాంతికి శత్రువుగా నిరూపించుకుందని అన్నారు. పాకిస్తాన్ శాంతిని కోరుతుందని కానీ దాన్ని బలహీనతగా భావించకూడదని చెప్పారు. సార్వభౌమత్వం లేదా భద్రతపై సవాలు వచ్చినట్లయితే బలమైన ప్రతిస్పందన ఇస్తామని హెచ్చరించారు.

## వికసిత్ భారత్ కోసం అందరూ పనిచేయాలి

-జాతినుద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
-బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి
-మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ప్రశంసలు గుప్పించిన ముర్ము

న్యూఢిల్లీ:



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాతంత్ర్య దినోత్సవ సంధ్య వేళ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో దేశ పురోగతి, జాతీయ భద్రత, సామాజిక న్యాయం మరియు భవిష్యత్తు లక్ష్యాలను ప్రతిబింబించేలా సాగింది. దేశప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రారంభమైన ఈ సందేశంలో భారతదేశం సాధిస్తున్న సాంకేతిక, ఆర్థిక, సామాజిక విజయాలను ప్రస్తావించడంతో పాటు, రాబోయే దశాబ్దాల్లో దేశం అనుసరించాల్సిన వ్యూహాత్మక దిశానిర్దేశాన్ని స్పష్టం చేశారు. భారతదేశం తన స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే 2047 నాటికి దేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన గమ్యస్థానంగా (వికసిత్ భారత్) మార్చడమే మన ప్రాథమిక డిజైన్ అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సమగ్ర భాగస్వామ్యం: ఈ లక్ష్య సాధన కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు, వ్యవస్థ, రంగాలు భాగస్వామ్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థిక నిలకడ మరియు సాంకేతికత: డిజిటల్ విప్లవం, హరిత ఇంధనం, స్టార్టప్ సంస్కృతి మరియు తయారీ రంగం భారత్‌ను ప్రపంచంలో కీలక ఆర్థిక శక్తిగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాల వేగవంతమైన పురోగతితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే అందరికీ ఫలాలు అందే 'సమ్మేళన అభివృద్ధి' సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు.

## అసెంబ్లీకి రా... నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

మొదటి తరువాయి

పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా జగన్ కు అవకాశమిచ్చారని, తమ నియోజకవర్గవాసుల ఆకాంక్షలను నెరవేర్చేలా అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ఆయన ఉందన్నారు. గ్రూప్ 1 జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుడానికే జగన్, ఆయన బ్యాచ్ మెగా డీఎస్సీలో అక్రమాలంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కడప జిల్లాలో రూ.220 కోట్లకుపైగా ఆర్ అండ్ బి రోడ్లు, ఇతర రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆ పనులన్నీ 80 శాతం పూర్తి కావచ్చాయని, మిగిలిన 20 శాతం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. పులివెందులలో ఒకరోజు పర్యటన నిమిత్తం వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత... మరో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో కలిసి ఆర్ అండ్ బి రహదారులు, బీసీ సంక్షేమ పథకాలపై శుక్రవారం సమీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవితో కలిసి మంత్రులు మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యమి స్తున్నారన్నారు. రైజింగ్ రాయలసీమ లక్ష్యంగా ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, మరొకవైపు పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. కర్నూలు, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తూ రాయలసీమను పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**మెగా డీఎస్సీపై డైవర్షన్ రాజకీయం**

తాను చేసిన తప్పుడాలను కప్పిపుచ్చుకోవడానికి జగన్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను సిట్ బట్టబయలు చేసిందన్నారు. ఈ అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ జగన్, ఆయన బ్యాచ్ పెద్ద డ్రామాకు తెరతీశారన్నారు. గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. చివరికి విద్యార్థులను, కూలీలను ధర్నాలుకు తరలించే దుస్థితికి వైసీపీ నాయకులు దిగజారిపోయారని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

## ప్రతి ఎకరాకు నీరందిస్తాం

మొదటి తరువాయి

పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నాం. టీడీపీ హయాంలో మంత్రి అచ్చెన్న చేతులమీదుగా దీనికి శంకుస్థాపన చేశాం. కొంతమేర పనులు చేపట్టగా.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి పాలనలో ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా.. ఎన్నికల హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తూ పాలన సాగిస్తున్నార'ని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి పాలన సాగుతోంది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు, సాగునీరందిస్తాం. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. సెప్టెంబరులో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామ'ని తెలిపారు.

# ఎర్రకోట ముస్తాబు

**--వందేమాతరంతో కొత్త శకం**
**-పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం**
**-ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు**
**-బస్తర్‌లోని 92 గ్రామాల్లో వేడుకలు**
**-ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. హైఅలర్ట్**



దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పలు ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ముఖ్యంగా 150 ఏళ్లు పూర్తి చేసుకున్న జాతీయ గీతం వందేమాతరం తొలిసారిగా ఎర్రకోట వేదికపై ఆలపించనుండటం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. యువత శక్తిని ప్రతిబింబించేలా ఈ ఏడాది వేడుకలకు యువ శక్తే ప్రధాన ఇతివృత్తంగా నిర్ణయించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోట ప్రాంగణంలో వందేమాతరాన్ని ఆలపించనున్నారు. ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకున్న అనంతరం జాతీయ గీతం వందేమాతరంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం ప్రధాని జాతీయ జెండాను ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరానికి ఈ ఏడాది 150 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. భారత వ్యోమనిక దళానికి చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ 150 ఏళ్ల వందేమాతరం స్మారక బ్యానర్ను మోసుకెళ్లడంతో పాటు ఎర్రకోట వద్దకు చేరుకున్న ప్రజలపై పూలవర్షం కురిపించనుంది.

**యువ శక్తికి పెద్దపీట**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత పాత్రను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. దేశ ప్రగతిలో యువశక్తి చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహిస్తున్నారు. 2026 అంతర్జాతీయ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లలో పతకాలు సాధించిన 19 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరిని ఎర్రకోట ప్రాకారంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో కూర్చోబెట్టనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ యువత సాధిస్తున్న విజయాలకు వీరి ప్రతిభను ప్రతీకగా చూపించనున్నారు.

**'సేవా తీర్థ్' స్ఫూర్తితో ఆహ్వానాలు**

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సేవా తీర్థ్ ఇతివృత్తంతో ఆహ్వాన పత్రాలను రూపొందించారు. ప్రతి పౌరుడి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలనే సందేశాన్ని ఇది అందిస్తోంది. ఆహ్వాన పత్రంలోని ధర్మచక్రం న్యాయబద్ధమైన కర్తవ్యాన్ని, నిరంతర నిస్వార్థ సేవను ప్రతిబింబించేలా రూపొందించారు. దేశం ముందు.. సేవా భావం, బాధ్యత, కర్తవ్యమే ప్రధానమనే సందేశాన్ని సేవా తీర్థద్వారా చాటుతున్నారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ఎర్రకోటలో ఈసారి ఏర్పాటు చేసిన సిట్టింగ్ ఎన్‌క్లోజర్లకు దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లు పెట్టారు. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**నక్సల్ ప్రభావిత గ్రామాల్లో తొలిసారి త్రివర్ణ పతాకం**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈసారి ఛత్తీస్‌గఢ్‌లోనూ ప్రత్యేకతను సంతరించుకోనున్నాయి. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తి పొందిన ప్రాంతాల్లో తొలిసారిగా జాతీయ జెండా ఎగురవేయనున్నారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను వామపక్ష తీవ్రవాద రహిత రాష్ట్రంగా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి తీర్థంగా యాత్రను గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లనున్నారు. బస్తర్ ప్రాంతంలోని 92 గ్రామాల్లో ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రబిందువుగా ఉన్న ప్రాంతాల్లోనే ఇప్పుడు త్రివర్ణ పతాకం రెపరెపలాడనుండటం దేశంలో మారుతున్న పరిస్థితులకు ప్రతీకగా నిలవనుంది. మారుమూల గ్రామాలు, పాఠశాలల్లోనూ 'తిరంగా యాత్ర' నిర్వహించి ప్రజలను స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములను చేయనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణాన్ని కూడా ప్రజల సందర్శనకు తెరవనున్నారు. ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ భవనాన్ని త్రివర్ణ రంగుల ప్రత్యేక లైటింగ్‌తో అలంకరించనున్నారు. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బృందాలు దేశభక్తి గీతాలను ఆలపించనుండగా, సాహిత్య కళా పరిషత్ కళాకారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సందర్శకులకు ముందస్తు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అయితే భద్రతా తనిఖీల అనంతరం మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. సందర్శకులు ఆధార్ వంటి చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాన్ని వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

**యువత నుంచి మారుమూల గ్రామాల వరకు..**

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేవలం ఢిల్లీలోని ఎర్రకోటకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో జరగనున్నాయి. ఒకవైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజయాలు సాధిస్తున్న యువతకు గుర్తింపు లభిస్తుండగా.. మరోవైపు గతంలో మావోయిస్టుల ప్రభావంలో ఉన్న బస్తర్ వంటి ప్రాంతాల్లో త్రివర్ణ పతాకం రెపరెప లాడనుంది. యువ శక్తి నుంచి సేవా తీర్థ్ వరకు.. వందేమాతరం నుంచి బస్తర్ గ్రామాల్లో త్రివర్ణ పతాకం వరకు.. ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఐక్యత, యువత శక్తి, సేవా భావం, జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది.

# యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు

మొదటి తరువాయి

ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం వచ్చినప్పటికీ, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని నివేదికలో పేర్కొన్నారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పలు కీలక సూచనలు చేశారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల వంటి మౌలిక వసతుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల మనోభావాలను గౌరవించేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మొత్తం 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, లోటు వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, జలధార-జలహారతి కార్యక్రమాల అమలు వంటి అనేక కీలక అంశాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాయలంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు జల వనరుల శాఖ సీఎంకు తెలియజేసింది. ఈఆర్ఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్లామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్లు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ తవ్వేన్ను పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో, 17,500 క్యూసెక్కులు నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు.

# వ్యక్తిగత అంశాలు, దూషణలు వద్దు

మొదటి తరువాయి




పార్టీ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి ప్రభావానికి లోనుకావద్దని జనసేన శ్రేణులకు సూచించారు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా మాట్లాడాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థుల సోషల్ మీడియా ప్రచార వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా వ్యవహరించే వారిని పార్టీ ఉపేక్షించదని స్పష్టం చేశారు. పార్టీ అభ్యున్నతితో పాటు పార్టీ కోసం కష్టించి పనిచేస్తున్న జనసైనికులు, వీర మహిళల సంక్షేమం ఎల్లప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుందని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని జనసేన శ్రేణులకు సూచించింది.

# ఆగష్టు చివరి వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం

న్యూఢిల్లీ:

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు కనిపిస్తోంది. అయితే, వానాకాలంలో భారీ వర్షాలు నమోదయ్యేది ఆగష్టులోనే. అందుకే ఈ నెలలో కూడా దేశంలో భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాతావరణం వర్షాలకు అనుకూలంగా ఉందని యురోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ అంచనా ప్రకారం వచ్చే 15 రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా సెంట్రల్ ఇండియాతోపాటు దేశంలోని తూర్పు, పశ్చిమ



ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతాన్ని ఈ సీజన్ రెయిన్ ఫ్యాక్టరీ అంటారు. ఈ కాలంలో వర్షాలకు కారణమయ్యేది ఇదే. దీనికి అనుగుణంగా ప్రస్తుతం అనేక అల్పపీడన వ్యవస్తలు బంగాళాఖాతంలో భారీ సంఖ్యలో, ఒకదాని తర్వాత ఒకటి ఏర్పడుతున్నాయి. వీటివల్లే దేశంలో వర్షాలకు ఛాన్స్ ఉంది. ఈ అల్పపీడన వ్యవస్థలు మెల్లిగా దేశంలోకి కదులుతాయి. వీటివల్ల ఇప్పటికే ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌తోపాటు ఈశాన్య భారతదేశంలో తేమ శాతం పెరిగింది. ఈ కారణంగా ఆగష్టు చివరివారం వరకు వర్షాలకు ఛాన్స్ ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో కారణంగా దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్తితులు ఏర్పడ్డాయి. దీంతో అనేక చోట్ల కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. అందువల్ల బంగాళాఖాతంలో ఏర్పడ్డ వ్యవస్తల వల్ల వర్షాలు కురిస్తే, పరిస్తితుల్లో మార్పు రావొచ్చు. వర్షపు లోటు తగ్గవచ్చు.

# పశుగ్రాసం కొరత నివారణకు
# సామూహిక విత్తనాల విత్తనం






**-తీవ్ర ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం ముందస్తు చర్యలు**

**తనకల్లు: ఆగస్టు 14, ( నేటి దర్శిని )**
తనకల్లు మండలంలోని చిన్న రామన్న గారి పల్లి పెద్ద చెరువు నందు సామూహిక పశుగ్రాసం పెంపకం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఏర్పడే తీవ్ర పశుగ్రాసం కొరతను అధిగమించడానికి పశుసంవర్ధక శాఖ మరియు విబి-జి రాంజీ శాఖల ఉమ్మడి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు యాభై మంది పశు రైతులు కలిసి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామ నాయక్ మాట్లాడుతూ, గ్రామంలో చేపట్టిన ఈ సామూహిక పశుగ్రాసాన్ని రైతులందరూ ఎంతో జాగ్రత్తగా సంరక్షించుకుని సరైన రీతిలో ఉపయోగించుకోవాలని కోరారు. విత్తనాలు చల్లిన నాటి నుండి నలభై రోజుల వరకు పశువులు ఏవీ మేయకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశు గ్రాస పంటను కాపాడే బాధ్యతను ఇద్దరు కాపలాదారులకు అప్పగించినట్లు వివరించారు. సహాయ ప్రాజెక్టు అధికారి మరియమ్మ మాట్లాడుతూ, పశువుల మేత కొరత రాకుండా ఉండేందుకు ఈ సామూహిక పశుగ్రాసం పెంపకం నమూనాను ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోనూ అమలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామ నాయక్, పశు వైద్యాధికారి రవి నాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, విబి-జి రాంజీ సంస్థ సిబ్బంది, స్థానిక రైతులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఐ. పోలవరం మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ సైకిల్ ర్యాలీ



**ముమ్మిడివరం,ఆగస్టు 14,( నేటి దర్శిని )**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ. పోలవరం మండలంలో సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఐ. పోలవరం మండల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ఐ. పోలవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సాగిరాజు సూరిబాబు రాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటుతూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ మండలంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## పునరుత్పత్తి ఆరోగ్యంపై సమగ్ర అవగాహన అవసరం



**తాళ్ళరేవు, ఆగస్టు 14, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు మరియు కిషోర బాలికలకు కౌమార గర్భం,పునరుత్పత్తి ఆరోగ్యం మరియు ఋతు పరిశుభ్రతపై త్రైమాసిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ కిషోర్ బాలికలకు కౌమార గర్భాలు రావడం వలన సంభవించే నష్టాలను గురించి వివరించారు. పునరుత్పత్తి ఆరోగ్యంపై సమగ్ర అవగాహన అవసరమని నందివర్ధన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త చంద్రకళ మాట్లాడుతూ రుతు పరిశుభ్రత పాటించవలసిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ లోవరాజు మాట్లాడుతూ కిషోర్ బాలికలు వారి తల్లులు యుక్త వయసుకు వచ్చే సమయంలో వచ్చే మార్పులపై అవగాహన కలిగి ఉండి, అందుకు అనుగుణంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని మహిళలు కిషోర్ బాలికలు మరియు బీమా బాయి మహిళా మండలి ఆర్గనైజర్ లు ఏ వరలక్ష్మి, సిహెచ్ సునీత, డి దేవి, ఎన్ నాగమణి పాల్గొన్నారు.

## ముమ్మిడివరం నగర పంచాయతీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ



**ముమ్మిడివరం,ఆగస్టు 14,( నేటి దర్శిని )**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ కమిషనర్ పి.రవివర్మ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీని నిర్వహించారు.జాతీయ జెండా పట్ల దేశ భక్తి, గౌరవం, జాతీయ సమైఖ్యత చాటుతూ హర్ ఘర్ తిరంగా యొక్క సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ. కె.శ్రీనివాసు, మేనేజర్ ఇంచార్జ్ కె.వదన్, ఆర్.ఐ. భాస్కరరావు, అడ్మిన్ పి.శ్రీనివాస్, స్వర్ణ వార్డు సిబ్బంది, నగర పంచాయతి మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కోరంగి, జార్జిపేటలో మొక్కలు నాటిన ప్రత్యేక అధికారి



**తాళ్లరేవు, ఆగస్టు 14 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి, జార్జిపేట గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీల ప్రత్యేక అధికారి వి.జె.వి. రమణ ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వి.జె.వి. రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, వాటిని అరికట్టేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేష్, దానం సీత శ్రీలక్ష్మి, శ్యామ్, సీనియర్ నాయకులు కూనపురెడ్డి కామేశ్వరరావు, కడలి శ్రీనివాస్, గుత్తుల సూర్యనారాయణ, కనకాల త్రిమూర్తులు, పి. నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది శ్రీను, నాగేంద్ర, ప్రసాద్, జార్జిపేట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శిరివెళ్ళ గ్రామంలో ఘనంగా

**'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ.**

-ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపు.



**శిరివెళ్ళ ఆగస్టు 14, ( నేటి దర్శిని**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నంద్యాల జిల్లా శిరివెళ్ళ గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గురువారం ఘనంగా జాతీయ జెండాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహాశీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివమలేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి తలారి నరసింహుడు మరియు సచివాలయ సిబ్బంది నాయకత్వం వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ప్రధాన సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో అధికారులు, సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి. దేశభక్తిని పెంపొందించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను సగర్వంగా ఎగరవేయాలని అధికారులు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య సంబరాలను ప్రజలందరూ ఐకమత్యంతో జరుపుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో స్థానిక ప్రజలు, సచివాలయ సిబ్బంది, ఆసక్తికర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారా సైక్లింగ్ విజేత అర్షద్‌కు మైనారిటీ మంత్రి ఫరూక్ అభినందన

-నేడు గవర్నర్ అట్ హోమ్ కార్యక్రమానికి అర్షద్ కు ఆహ్వానం





**అమరావతి,ఆగస్టు 14, ( నేటి దర్శిని )**
డెన్మార్క్ లో జరిగిన గ్రాండ్ పిక్స్ పారా క్రీడా పోటీల్లో భారత్ తరపున పాల్గొని సత్తా చాటిన క్రీడాకారుడు షేక్ అర్షద్(నంద్యాల)ను మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించారు. పారా క్రీడా వేదికలో సైక్లింగ్ విభాగంలో రెండు బంగారు, మూడు వెండి, ఒక కాంస్యం తో మొత్తం 6 పతకాలు సాధించడం రాష్ట్రానికి గర్వించదగ్గ విషయమని శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో వివిధ పారా క్రీడా పోటీలు, పారా ఒలంపిక్స్ పోటీలలో నంద్యాల కు చెందిన షేక్ అర్షద్ పాల్గొని పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. 2024 లో ఫ్రాన్స్ రాజధాని పారిస్ లో జరిగిన పారాలింపిక్ గేమ్స్ లో భారత్ తరపున పాల్గొన్న ప్రథమ పారా సైక్లిస్ట్ గా అర్షద్ అందరికీ సుపరిచితుడే. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఏపీ ప్రభుత్వం నిర్వహించిన మైనారిటీల సంక్షేమ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా షేక్ అర్షద్ ను మౌలానా ఆజాద్ మెమోరియల్ బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ అవార్డు తో సన్మానించడం, మరియు ఆ సందర్భంలో గ్రూప్ -2 ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. ఇటీవల డెన్మార్క్ లో జరిగిన పోటీల్లో 6 పతకాలు సాధించి తన క్రీడా ప్రతిభాపాటవాలతో అర్షద్ మరోసారి సత్తా చాటడం నంద్యాల ఖ్యాతి మరియు మన రాష్ట్ర ఖ్యాతి మరోసారి మార్మోగిందని మంత్రి అభినందించారు. కాగా ఆగస్టు 15 స్వాతంత్రం దినోత్సవం రోజున లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ నిర్వహించే అట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా షేక్ అర్షద్ కు ఆహ్వానం అందింది.

## 3 ఏళ్ల చిన్నారి అరుదైన సాహసం

-మదనపల్లె నుండి కదిరి వరకు 79 కి.మీ. నాన్‌స్టాప్ స్కేటింగ్‌తో ప్రపంచ రికార్డు!






**తనకల్లు ఆగస్టు 14, ( నేటి దర్శిని )**
అన్నమయ్య జిల్లా మదనపల్లె నుండి కదిరి వరకు 79 కిలోమీటర్ల దూరాన్ని నాన్‌స్టాప్ స్కేటింగ్ చేస్తూ 3 సంవత్సరాల చిన్నారి అనంత దక్షిత్ అద్భుత ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ చిన్నారికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అతి చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను కనబరుస్తూ ఇప్పటికే 4 ప్రపంచ రికార్డులు సాధించిన అనంత దక్షిత్ పట్టుదలను ఎమ్మెల్యే అభినందించారు. 79 కిలోమీటర్ల నాన్‌స్టాప్ స్కేటింగ్‌తో తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్న దక్షిత్ కృషి, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ చిన్నారి మరిన్ని అద్భుత విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రతిభావంతులైన చిన్నారులను సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అద్భుత రికార్డుతో మెరిసిన చిన్నారి అనంత దక్షిత్‌కు ప్రజాప్రతినిధులు, స్థానికులు, క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు.

## హర్ ఘర్ తిరంగా విద్యార్థులు భారీ ర్యాలీ



**ఉరవకొండ ఆగస్టు 14, ( నేటి దర్శిని )**
80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల భాగంగా ఉరవకొండ పట్టణంలో శుక్రవారం హర్ ఘర్ తిరంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద అసిస్టెంట్ కలెక్టర్ సుయస్ కుమార్ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు ఈ ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం వద్ద నుండి టవర్ క్లాక్ వరకు కొనసాగింది. విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకొని వందేమాతరం అంటూ దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ, సీఐ మహానంది, ఎంపీడీవో రవి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవోలు సతీష్ కుమార్, మహమ్మద్ రఫీ, గ్రామ కార్యదర్శి సయ్యద్ షామీర్, ఎం ఈ వో -2 రమాదేవి, ఏపీవో సుజాత, ఏవో శంకర్, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జయప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడేళ్ల తర్వాత డీపీ మార్చిన ప్రభాస్.. ఫౌజీ లుక్‌తో వైరల్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయన 'ఫౌజీ' చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఎలాంటి విరామం లేకుండా అటు తరువాత 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో కూడా పాల్గొననున్నారు. అయితే తన సినిమాలతో పాటు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో, తోటి నటులకు మద్దతుగా నిలవడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోషల్ మీడియా ఖాతాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ పిక్చర్ (డీపీ)ను మార్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఫౌజీ'కి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తన కొత్త డీపీగా సెట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మేకర్స్ నుంచి త్వరలోనే మరిన్ని కీలక అప్‌డేట్లు రానున్నాయి. ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా,

# లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా వెంకటేష్..

## -అనిల్ రావిపుడి మూవీ నుంచి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్!




టాలీవుడ్ లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన విక్టరీ వెంకటేష్ మరియు సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపుడి కలయికలో వస్తున్న తాజా చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా రిలీజ్ చేయగా, సోషల్ మీడియాలో ప్రస్తుతం ఇది తెగ వైరల్ అవుతోంది.ఈ పోస్టర్ ద్వారా సినిమాలోని హీరో పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర యూనిట్ పరిచయం చేసింది. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన కౌంటర్-టెర్రరిజం మరియు హాస్టేజ్ నెగోషియేషన్ విభాగంలో స్పెషలైజేషన్ కలిగిన ఆర్మీ ఆఫీసర్‌గా ఈ పాత్ర అత్యంత కీలకంగా ఉండనుంది. విడుదలైన పోస్టర్‌లో విక్టరీ వెంకటేష్ పూర్తి ఆర్మీ కమోఫ్లాజ్ యూనిఫామ్, బ్లాక్ కంబాట్ బూట్స్, సన్‌గ్లాసెస్ ధరించి చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఒక విలాసవంతమైన బ్లాక్ కలర్ మెర్సిడెస్-బెంజ్ జి-క్లాస్ (జి-వ్యాగన్) కారు బంపర్పై కాలు పెట్టి, ఎంతో గంభీరంగా నిలబడి ఉన్న భంగిమ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. వెనుకవైపు యుద్ధ వాతావరణాన్ని తలపించేలా మేఘావృతమైన ఆకాశం, ఎగురుతున్న మిలటరీ హెలికాప్టర్లు, మరియు కింద ఎగురుతున్న దుమ్ము, నిప్పు రవ్వల ఎఫెక్ట్స్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. శ్రీమతి అర్చన సమర్పణలో' షైన్ స్క్రీన్స్ మరియు జెడ్ స్టూడియోస్ పతాకాలపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. దేశభక్తి, హై-వోల్టేజ్ యాక్షన్ మరియు పూర్తి కమర్షియల్ హంగులతో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమా అనుభూతిని పంచడం ఖాయమని ఫస్ట్ లుక్ చూస్తే స్పష్టమవుతోంది.


# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా

వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది.నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు




సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.




Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450